

మిర్చి రైతుకు ధరల దెబ్బ..



ప్రారంభంలోనే పాతాళానికి రేటు

పెట్టుబడి కూడా రాని దుస్థితి

అన్నదాతల్లో ఆందోళన

హిందూపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎండు మిర్చి మార్కెట్.. రైతులకు నష్టాలతో స్వాగతం పలుకుతోంది. ధరలు దారుణంగా పలుకుతుండడంతో అన్నదాత నష్టాలు మూటగట్టుకుని వెనుదిరుగుతున్నాడు. పురం మార్కెట్‌కు ఎండుమిర్చి దిగుబడులు రావడం ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతోంది. మొదట్లోనే ధరలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళ, శుక్రవారాల్లో 500 బస్తాలకుపైగా ఎండుమిర్చి దిగుబడులు వస్తున్నాయి. వాటిలో మేలురకం ఎండు మిర్చి క్వింటాల్ రూ.15వేలదాకా ధర పలుకుతోంది. రెండోరకం రూ.8వేల నుంచి రూ.10వేలు, మూడో రకం రూ.6వేల నుంచి రూ.7వేలతో అమ్ముడుపోతోంది. ఈ ధరలకు విక్రయిస్తే పెట్టుబడి కూడా దక్కదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి, ఆరుగాలం శ్రమించి మిర్చి పంట పండిస్తే మార్కెట్‌కు వచ్చేసరికి ధరలు పతనమై రైతన్నలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. ధరలు ఇలాగే ఉంటే పంటపై తెచ్చిన అప్పులు కూడా తీర్చే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు.

నష్టాల ఘాటు

ఎండు మిర్చి ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్‌దే అగ్రస్థానం. రైతులకు మాత్రం నష్టాల ఘాటు తప్పడం లేదు. నిలకడలేని ధరలతోపాటు అస్థిరమైన దిగుబడులు రైతులకు శాపంగా మారాయి. గిట్టుబాటు ధర కల్పించడం, ధరల స్థిరీకరణ ద్వారా కొంతమేరైనా ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం మిర్చిసాగులో నష్టాలు తప్పట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ధర వస్తుందో, ఎప్పుడు నష్టం వస్తుందో అంచనాలకు అందని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఎక్కడ చూసినా ఏసీ గోదాముల్లో గతేడాది పండిన ఎండుమిర్చి నిలువ ఉంది. దీంతో ఈసారి కొత్తగా వచ్చిన పంట ధర తగ్గడానికి కారణమైంది.



మార్కెట్‌లో సంచుల్లో నింపుతున్న ఎండు మిర్చి

పెట్టుబడి కూడా దక్కదు



నాకున్న 1.5 ఎకరాలో మిర్చి సాగుచేశా. రూ.లక్షకుపైగా ఖర్చు వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.13 వేలు పలికింది. అందులో కూడా మొదటిరకం. రెండో రకం ఇంకా తక్కువ ధరకు అమ్ముడుపోతోంది. ఇలాగే ధరలు ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా దక్కదు.

-ప్రకాశ్, బ్రహ్మసముద్రం

ఎకరాలో సాగు చేయాలంటే..

ఎకరాలో ఎండు మిర్చి సాగు చేయాలంటే రూ.70 నుంచి రూ.80వేలు ఖర్చవుతోంది. మార్కెట్లో ధరలు మాత్రం రోజురోజుకీ పడిపోతున్నాయి. బాగా పండితే ఎకరాలో 8 నుంచి 10క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్‌కు వచ్చాక కమిషన్, రవాణా, ఇతర ఖర్చులుపోను సగటున రైతుకు వచ్చేది రూ.80 వేల నుంచి రూ.90 వేలు మాత్రమే. పెట్టుబడి కూడా అంతే వస్తుండడంతో ఏమీ మిగలట్లేదు. దిగుబడి అంతంత మాత్రమే వస్తే.. నష్టాలు తప్పవు.

500 ఎకరాల్లో సాగు

జిల్లాలో రైతులు ఈ ఏడాది 500 ఎకరాలకుపైగా ఎండు మర్చి పంట సాగుచేసినట్లు తెలుస్తోంది. ఉద్యాన శాఖాధికారుల లెక్కల ప్రకారం 350 ఎకరాల్లోపు చూపిస్తున్నాయి. ఎకరా, అర ఎకరాలో సాగుచేసిన రైతులు కొంతమంది వివరాలు ఉద్యాన శాఖ రికార్డులకెక్కలేదు. గతేడాది 800ఎకరాల వరకు సాగుచేశారు. ధరలు రావని పంట సాగు కూడా తగ్గించారు. అయినా ధరలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి.

ఇలాగే కొనసాగితే.. పంట సాగుచేయం



ఎండు మిర్చి ధరలు ఇలాగే ఉంటే వచ్చే ఏడాది నుంచి పంట సాగు చేయం. పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ఎండు మిర్చి కోయడానికి మహిళా కూలీలకు రోజుకు రూ.300తోపాటు భోజన సౌకర్యం కల్పించాలి. ధరలు మార్కెట్‌లో అంతంత మాత్రమే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మిర్చి పంటను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లే. దీంతో పంట సాగుచేయకపోవడమే మేలనిపిస్తోంది.

- అమర్నాథ్, సోమందేపల్లి మండలం



సరస్వతి అలంకరణలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

సరస్వతీ నమస్తుభ్యం..!



సరస్వతి అలంకరణలో దుర్గాదేవి

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి, లేపాక్షి దుర్గాదేవి సోమవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కదిరి ఆలయంలో నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం సరస్వతి అలంకరణలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి, ఉభయదారులు, అర్చకులు పాల్గొన్నారు. లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు కొనసాగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, కదిరి, లేపాక్షి

అర్జీలపై అలసత్వం వద్దు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే అర్జీల పట్ల అధికారులు అసత్వం ప్రదర్శించకూడదని, సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 246 అర్జీలను స్వీకరించారు. అనంతరం అర్జీలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలనుకూడా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, భూసమస్యలు, ఇంటిపట్టాల మంజూరు, పింఛన్ల తదితర సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఎ్‌ఎఓ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సత్వర న్యాయం జరగాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎ‌స్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సతీష్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ కలహాలు, భూ సమస్యలు, దంపతుల గొడవలు, సైబర్ నేరాల తదితర సమస్యలపై 70 ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత స్టేషన్ పోలీసు అధికారుకు ఎస్పీ ఫోన్ చేసి, చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

సత్యసాయి శత జయంతికి ఏర్పాట్లు

రూ.12 కోట్ల పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి పుట్టపర్తిలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. సత్యసాయి మందిరం పడమర గేటు నుంచి వడ్డి వంక వరకు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి నాలుగు లైన్ల రహదారి, తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రహదారులు, మున్సిపాలిటీ పరిధిలోని పలు సీసీ రోడ్ల మరమ్మతు పనులు ఇందులో ఉన్నాయి. వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్, ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబులపతి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మాజీ ఛైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, డీఈ నరసింహమూర్తి, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రేగడి రెడీ

రేపట్నుంచి రబీ సీజన్

నల్లరేగడి భూములను సిద్ధం చేసుకున్న రైతులు

పదును వాన పడితే విత్తేయడమే..



పుట్లూరు వద్ద పప్పుశనగ విత్తేందుకు సిద్ధంగా ఉంచిన నల్లరేగడి పొలం

అనంతపురం అర్బన్/బెళుగుప్ప సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ విత్తుకు నల్లరేగడి భూములను రైతులు సర్వం సిద్ధం చేసుకున్నారు. రబీ సీజన్‌కు ముందే పదును వర్షం పడటంతో నల్లరేగడి భూముల్లో ఇప్పటికే సేద్యం పనులు పూర్తయ్యాయి. గత నెలలో వరుసగా పదును వానలు పడటంతో సేద్యం చేసుకున్నారు. అక్టోబరు 1వ తేదీన రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఈసారి రబీ సీజన్‌కు ముందుగానే పదిరోజులుగా పొలాల్లో డీఏపీ, ఇతర రకాల ఎరువులు వేసుకుంటున్నారు. మరోమారు పదును వర్షం పడితే పప్పుశనగ విత్తనం వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం చిన్న, సన్నకారు రైతులు ఎదురు చూస్తున్నారు.

కేటాయింపుల్లో కోత

ఏటా రబీ సీజన్‌లో 55వేల హెక్టార్లకుపైగానే పప్పుశనగ పంట సాగవుతోంది. పప్పుశనగ కేటాయింపుల్లో ప్రభుత్వం కోత పెట్టింది. గతేడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగను కేటాయించారు. ఈసారి 14వేల క్వింటాళ్లే ఇవ్వనుంది. జిల్లాలో ఎక్కువ శాతం మంది సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడి పంటను సాగు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, పప్పుశనగ కేటాయింపులు పెంచాలని రైతులు కోరుతున్నారు.

డీఏపీకి డిమాండ్

రబీ సీజన్‌కు ముందుగానే పదును వర్షాలు పడటంతో నల్లరేగడి భూముల్లో పప్పుశనగ విత్తు కోసం కొన్ని రోజులుగా దుక్కులు మొదలు పెట్టారు. విత్తనం వేసేందుకు ముందుగా డీఏపీ, చెక్కను దుక్కిలో వేసుకుంటున్నారు. మొక్క ఎదుగుదల, రోగనిరోధక శక్తిని పెంచేందుకు డీఏపీ బాగా ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితుల్లో డీఏపీకి డిమాండ్ పెరిగింది. డీఏపీ బస్తా (50 కేజీలు) ఎమ్మార్పీ రూ.1350 ఉంది. ఎకరాకు 2 బస్తాలదాకా డీఏపీ ఎరువును వాడుతున్నారు. మరికొందరు ఎకరాకు బస్తా చొప్పున డీఏపీ, చెక్క వేసుకుంటున్నారు. డీఏపీకి డిమాండ్ పెరగడంతో నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లోని డీలర్లు ధరలు (మిగతా 6లో...)

జీవన విధానమే ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది

సత్యసాయి బోధనలే ఆరోగ్య సూత్రాలు

వరల్డ్ హార్ట్ డేలో డాక్టర్ జగత్ నరులా

పుట్టపర్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీవన విధానమే.. ఆరోగ్య మార్గమని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ జగత్ నరులా అన్నారు. తీసుకున్న ఆహారం, చేసే పనులు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. ప్రశాంతి నిలయంలో సోమవారం వరల్డ్ హార్ట్ డేని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు, విద్యార్థులు ప్రశాంతి నిలయం నుంచి హిల్ వ్యూ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ యోగాసనాలు వేశారు. హీరా కన్వెన్షన్ హాల్‌లో ముగింపు సదస్సు నిర్వహించారు. సాయి కుల్వంత్ సభామండపంలో సాయంత్రం జరిగిన సదస్సులో డాక్టర్ జగత్ నరులా ప్రసంగించారు. వరల్డ్ హార్ట్ డేను నిర్వహించడానికి ఉత్తమ వేదికగా ప్రశాంతి నిలయాన్ని ఎంపిక చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 20 మిలియన్ల వరకు గుండె జబ్బులతో మరణిస్తున్నారని అన్నారు. కొన్ని మరణాలు కారణాలను గుర్తించలేని విధంగా ఉన్నాయని అన్నారు. నిత్యం తీసుకునే ఆహారం, చేసే పనులు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయన్నారు. సత్యసాయి బోధనలే ఆరోగ్యసూత్రాలని అభివర్ణించారు. శాకాహారం, నిత్యం యోగాసనాలు, వ్యాయామం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను ముందుగా గుర్తించవచ్చని అన్నారు. ప్రతి రోజు 20 వేల అడుగుల నడక ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు. తద్వారా బీపీ, షుగర్, హార్ట్ బీట్ నిలకడగా ఉంటాయని అన్నారు. ఒత్తిడిని ఎంత తగ్గించుకుంటే అంత మంచిదని అన్నారు. అనంతరం సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థులు వరల్డ్ హార్ట్ నాటికను ప్రదర్శించారు. పూర్ణచంద్ర హాల్‌లో నాలుగో రోజు వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం కొనసాగింది.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ల బృందం

క్యాన్సర్ బాధితులకు సమగ్ర వైద్యం

వచ్చే ఏడాది జిల్లాలో క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

సూపర్ స్పెషాలిటీలో ప్రపంచ హృదయ దినోత్సవం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితుల కోసం జిల్లాలో సమగ్ర క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ప్రపంచ హృదయ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్డియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. కలెక్టర్ ఆనంద్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనడిక్ట్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్‌తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచంలో 20 శాతం మరణాలకు గుండె జబ్బులు కారణమని, రెండో స్థానంలో క్యాన్సర్ బాధితులు ఉన్నారని అన్నారు. ఐసీఎంఆర్ నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా 15.60 లక్షల మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని తెలిపారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ (మిగతా 6లో...)



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అభివృద్ధి.. సంక్షేమం ఆగదు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమ, అభివృద్ధి పతకాలు ఆగవని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలో కార్డుదారులకు ఆమె స్మార్ట్ రైస్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో 6,309, నియోజకవర్గంలో 949 మందికి స్మార్ట్ కార్డులను పంపిణీ చేశామని తెలిపారు. జగన్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా గడిచిన 15 నెలల కాలంలో 4.70 లక్షల ఉద్యోగాలు భర్తీచేశామని అన్నారు. ఎన్ని ఆరోపణలు చేసినా పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మించి తీరుతామని అన్నారు. ఆటోడ్రైవర్లకు రూ.15 వేలు అందజేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ స్వాతి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు పోలిరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ రైస్ కార్డులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి సవిత

పెళ్లికి వచ్చి.. పరలోకాలకు..!

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఇద్దరు కర్ణాటక యువకుల మృతి

వివరాలు 7వ పేజీలో

అడిగితేనే తగ్గింపు..!

మెడికల్ షాపులలో దోపిడీ

జీఎస్టీ తగ్గింపు ఫలం వ్యాపారుల జేబులోకి..

తనిఖీలు మరిచిన అధికారులు

● హిందూపురం పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో ఉన్న ఓ మందుల దుకాణంలో నాగేష్ అనే వ్యక్తి ఐడ్రాప్స్‌ను కొనుగోలు చేశాడు. దానిపై ఎమ్మార్పీ రూ.69 అని ఉంది. ప్రత్యేక రాయితీ పోనూ రూ.50 మాత్రమే తీసుకోవాలి. జీఎస్టీ తగ్గింపు కారణంగా మరో రూ.7 తగ్గించాలి. ఈ లెక్కన రూ.43కు ఇవ్వాలి. కానీ ఎమ్మార్పీ రూ.69 తీసుకున్నాడు దుకాణదారుడు. కొనుగోలుదారుడు ప్రశ్నిస్తే.. అప్పుడు జీఎస్టీ తగ్గించాడు.

● హిందూపురం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న మందుల దుకాణంలో చిలమత్తూరుకు చెందిన ఓ వ్యక్తి రూ.1500 మందులు కొనుగోలు చేశారు. ఈ బిల్లు ఎమ్మార్పీ ప్రకారమే వేశారు. కొనుగోలుదారుకు జీఎస్టీ తగ్గింపు గురించి అవగాహన లేదు. అందుకు మొత్తం డబ్బులు చెల్లించారు. ఇంటికి వెళ్లాక ఆయన కుమారుడు గమనించరు. జీఎస్టీ తగ్గింది కదా, బిల్లు తగ్గలేదా అని తండ్రిని ప్రశ్నించారు. 'ఎప్పటిలాగే బిల్లు వేశారు..' అని తండ్రి సమాధానమిచ్చారు. ఆ మందులు వెనక్కు తీసుకువెళ్లి తీసుకొచ్చి ప్రశ్నిస్తే.. అప్పుడు రూ.200 తగ్గించారు. పనిచేసేవారికి తెలియక జీఎస్టీ తగ్గించకుండా పాత ధరలు వేశారని వివరణ ఇచ్చాడు దుకాణదారు.

హిందూపురంలోని మెడికల్ షాపులలో జీఎస్టీ తగ్గింపు ఫలాలు రోగులకు కాకుండా, వ్యాపారులకు అందుతున్నాయి అనేందుకు ఈ రెండు దుకాణాలు ఉదాహరణ. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉందని పట్టణవాసులు అంటున్నారు. జిల్లావ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపు అమలు జరిగా లేదు. వైద్యం ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న 'జీఎస్టీ తగ్గింపు' నిర్ణయం క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడం లేదు. బయటి దుకాణాలే కాదు, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో దుకాణాలలోనూ ఇదే జరుగుతోంది. చాలాచోట్ల బిల్లులు ఇవ్వడం లేదు. తెల్లకాగితంపై రాసిస్తున్నారు. మందులు, సిరప్‌లపై ఎడాపెడా దోచేస్తున్నారు. అత్యవసర, క్యాన్సర్ మందులపై జీఎస్టీ 5, 12శాతం ఉండేది. పూర్తిగా తీసేశారు. ఇవీ అమలు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 1500 పైగా మందుల దుకాణాలు ఉన్నాయి. నెలకు రూ.150 కోట్ల ఔషధ విక్రయాలు జరుగుతున్నాయి. దోపిడీ కూడా అదే స్థాయిలో ఉంది.

తనిఖీలు మరిచారా..?

కేంద్ర ప్రభుత్వం సవరించిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలి. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. కేంద్ర జీఎస్టీ అధికారులు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదు. కొత్త జీఎస్టీపై అవగాహన కల్పించడం లేదు. ఫిర్యాదు చేద్దామంటే టోల్‌ఫ్రీ నంబర్లు, హెల్ప్‌లైన్ డె స్కులను అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా వ్యాపారుల దోపిడీ కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం

ఉద్యానంపై ధ్యాస పెట్టేరా..?

కొత్త కలెక్టర్‌పై 'అనంత' ఆశలు..!

ఫిబ్రవరిలో అనంత ఉద్యాన సమ్మేళనం

రాష్ట్రస్థాయిలో మొట్టమొదటగా నిర్వహణ

7 కంపెనీలతో ఒప్పందాలు

నెలలు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడని వైనం

కొత్త కలెక్టర్ చొరవపై రైతుల ఆశలు



కలెక్టర్ ఆనంద్



అనంత ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగంతో ఒప్పందం కుదుర్చుకుంటున్న కంపెనీల ప్రతినిధులు (ఫైల్)

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అ నంత ఉద్యాన సమ్మేళనం లక్ష్యా లు నెరవేర్చడంలో జిల్లా నూ తన కలెక్టర్ ఆనంద్ చొరవపై అనంత ఉద్యాన రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఉద్యాన రైతులకు మరింత చేయూతనిచ్చేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా అనంత ఉద్యా న సమ్మేళనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొ దటి వారంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యప్రజాప్రతినిధుల తోపా టు పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పా ల్గొన్నారు. 7 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని ఆ దర్శంగా తీసుకుని, ఇతర జిల్లాల్లోనూ నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం విశేషం. ఇంత వరకూ బాగానే ఉ న్నా.. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై శ్రద్ధ పెట్టలేదు. దీంతో ఇప్పటి దాకా ఉద్యాన సమ్మేళనం లక్ష్యం ఒక్క అ డుగు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌పై ఉద్యాన రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై ప్రత్యేక చొరవ చూపితేనే రైతులకు ప్రయోజనం లభించే అవకాశం ఉంది. లేదంటే కార్యక్రమ లక్ష్యాలు నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు నెలలవుతున్నా..

రాష్ట్రస్థాయిలో ఎన్నడూలేనివిధంగా జిల్లా కేంద్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో అనంత ఉద్యాన సమ్మేళనం నిర్వహించారు. ఏడు నెలలు కావస్తున్నా.. అందులో తీసుకున్న నిర్ణయాల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. అనంతలో పండించిన ఉద్యాన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, జిల్లా రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన పంటల కోత తర్వాత కూడా ఉద్యాన పంటల వ్యర్థాలతో పలు రకాల వస్తువులు తయారు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో గ్రోత్ ఇంజిన్స్ జాబితాలో అరటి, చీనీ, దానిమ్మ, ఎండుమిరప, టమోటా పంటలను ఎంపిక చేశారు. అరటితోపాటు మిగతా పంటల ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని నిర్ణయించారు. తొలి అనంత ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి, వచ్చే ఏడాది తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించారు. అనంత ఉద్యాన సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్నా.. కంపెనీల ప్రతినిధులతో ఈ ఏడాది మార్చిలో అప్పటి కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒప్పందం మేరకు చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు తయారు చేసి, క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఆయా కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కంపెనీలతో ఒప్పందాలివే..

అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. మైక్రో అల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిలెడ్ (అల్గా ఎనర్జీ స్పెయిన్ అనుబంధ సంస్థ), సిద్ధార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), ఆగ్రో లైఫ్ సైన్సెస్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ), అనన్యా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంటల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి.

మైక్రో అల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో అల్గే ఆధారిత సాంకేతికతను సమగ్ర పర్చడంలో పాల్గొంటుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో అల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ-ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

సిద్ధార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఎస్‌కే బనానా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అరటి పండ్లను ప్రీ కూల్ చేస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్ధార్థ పల్ప్, డీ హైడ్రేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేసి పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం, ఇతర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేయడం జరుగుతుంది. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయక ధరతో విక్రయించేలా చొరవ చూపేందుకు ఒప్పందం.

గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇతర ప్రాంతాల్లో ధరలను జిల్లా రైతులకు తెలియజేసి, కొత్త మార్కెటింగ్‌లో మద్దతు ధర లభించేలా చొరవ చూపేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ పంటలకు రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ (ఆర్‌ఎఫ్‌ఏ) సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్‌తో ప్రపంచంలో ఎక్కడైనా ఆయా పంటలను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంటల సాగులో ఏయే పద్ధతులు పాటిస్తే ఆర్‌ఎఫ్‌ఏ సర్టిఫికెట్ జారీ చేస్తారు..? తదితర అంశాలపై త్వరలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఆగ్రో లైఫ్ సైన్సెస్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణ కోసం ఏయే దశల్లో క్రిమిసంహారక మందులు వాడాలి. మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రిటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరలకు ఎరువులను అందజేసేలా ఒప్పందం.

అనన్యా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. ఈ కంపెనీ ద్వారా అరటి నుంచి వచ్చే నారతో బొమ్మలు, బ్యాగులు, టోపీలు, దుస్తులు తయారు చేసే టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో చర్చించి, షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన డ్వాక్రా సంఘాలకు ఆ కంపెనీతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసేలా ఒప్పందం.

క్యాన్సర్ బాధితులకు సమగ్ర వైద్యం



హడావుడి తగ్గిన తరువాత శ్రీరాములును వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

చికిత్సల ప్రక్రియను బలోపేతం చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అవగాహన లేని కారణంగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడంలేదన్నారు. ప్రతి యువతి, మహిళ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కియ పరిశ్రమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అధునాతన సాంకేతిక గుండె శస్త్రచికిత్స యంత్రాలను అందించిందని తెలిపారు. వాటిని వినియోగించి, 100 ఐవీయూఎస్ గైడెడ్, 500 యాంజియోగ్రామ్ ప్లాస్టీ సర్జరీలు చేసి, రోగుల ప్రాణాలను కాపాడిన కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఆయన బృందాన్ని అభినందిస్తున్నాన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలపై పత్రికల్లో వ్యతిరేక కథనాలు వస్తున్నాయని, ఇందుకు పలురకాల కారణాలున్నాయన్నారు. ఎవరినీ తప్పుపట్టడంలేదని, అలా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గుండె శస్త్ర చికిత్సలకు వినియోగించే అధునాతన యంత్రాలు, ఉపకరణాల ప్రదర్శనను మంత్రి తిలకించారు.

రోగులకు ఇబ్బంది..

మంత్రి, అధికారుల రాకతో సూపర్ స్పెషాలిటీలో హడావుడి ఏర్పడింది. ఆస్పత్రి ఆవరణలో అధికారులు, నాయకుల వాహనాలను నిలపడంతో 108 వాహనంలో వచ్చిన రోగిని ఆస్పత్రిలో చేర్పించడం ఆలస్యమైంది. సోమందేపల్లి మండలం నడింపల్లికి చెందిన శ్రీరాములు మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆపరేషన్ అవసరం కావడంతో సర్వజన వైద్యశాల నుంచి సూపర్ స్పెషాలిటీకి 108లో తెచ్చారు. మంత్రి వెళ్లిపోయి, హడావుడి తగ్గిన తరువాత వీల్ చైర్ తెచ్చి ఆస్పత్రిలోకి తరలించారు.

డ్రైవర్ జోరు

హృదయ దినోత్సవం ముగిశాక ఆస్పత్రి ఆవరణలో మంత్రి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వాహనం ఎక్కి బయలుదేరారు. ప్రొటోకాల్ వాహనాల్లో రెండు వెంటనే వెళ్లిపోగా, మూడో వాహన డ్రైవర్ హడావుడి చేశారు. త్వరగా వెళ్లే క్రమంలో అక్కడున్న వాహనాలను ఢీకొడుతూ, రాసుకుంటూ దూసుకుపోయారు. దీంతో బీజేపీ నాయకుడు చిరంజీవి రెడ్డి వాహనం, కలెక్టర్ వాహనం దెబ్బతిన్నాయి.




కలెక్టర్ కారును ఢీకొట్టి వెళుతున్న కాన్వాయ్ వాహనం

రేగడి రెడీ

(5వ పేజీ తరువాయి)

పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ఎరువుల దుకాణాల్లో పక్షం రోజుల క్రితం డీఏపీ బస్తా రూ.1400 నుంచి రూ.1450 వరకు విక్రయించారు. మూడు రోజుల నుంచి డీఏపీ బస్తా రూ.1500 నుంచి రూ.1600దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రైతులు ముందస్తుగానే డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేసుకున్నారు. రైతులు నల్లరేగడి పొలాల్లో దుక్కిలో వేసుకునేందుకు డీఏపీ కోసం వెళ్లగా స్టాక్ లేదని చెబుతుండడంతో అవాక్కవుతున్నారు. తాడిపత్రి, నల్లరేగడి భూములున్న ఇతర ప్రాంతాల్లో కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, మరింత అధిక ధరకు డీఏపీ విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో డీఏపీ బదులుగా కొందరు రైతులు 20-20-0-13, మరికొందరు ఎక్కువ ధర అయినప్పటికీ 14-35-14 రకం ఎరువులు వేసుకుంటున్నారు.

పప్పుశనగ విత్తేందుకు సిద్ధంగా ఉన్నా



28 ఎకరాల్లో పప్పుశనగ పంట విత్తేందుకు సిద్ధంగా ఉన్నా. ఈసారి రబీ సీజన్‌కు ముందే బాగా వర్షాలు రావడంతో సేద్యం పనులు చేసుకున్నా. డీఏపీని సైతం వేశా. మరోసారి వర్షం పడితే విత్తనం వేసేస్తాం. గతేడాది వర్షాభావంతో దిగుబడి సరిగా రాలేదు. ఈ సారైనా దిగుబడులు వస్తాయన్న ఆశతో ఉన్నాం. దేవుడిపై భారం వేసి, పప్పుశనగ విత్తనం వేస్తాం.

-తిరుపతయ్య, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నాం



ఏటా రబీ సీజన్‌లో పప్పుశనగ పంటనే సాగు చేస్తున్నా. ఈసారి 10 ఎకరాల్లో పంట పెట్టేందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నా. పదును వర్షం పడితే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నా. చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. గతేడాది తరహాలోనే రబీ సీజన్ ప్రారంభంలోనే సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు అందించి ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది.

- శ్రీరాములు, బెళుగుప్ప

పప్పుశనగ సబ్సిడీ ధర ఖరారు

క్వింటం పూర్తి ధర రూ.7,800

25 శాతం సబ్సిడీతో రైతుకు ఇచ్చే ధర రూ.5,850

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ సబ్సిడీ ధరను ప్రభుత్వం ఎట్టకేలకు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7800గా నిర్ణయించింది. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటాకి రూ.5,850 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా గరిష్ఠంగా 10 బస్తాల (బస్తా 20 కేజీలు) పప్పుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. దసరా పండుగ తర్వాత రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టే అవకాశం ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెద్దగా తేడా లేదు..

రైతు సేవాకేంద్రాల ద్వారా ప్రభుత్వం సబ్సిడీతో అందించే పప్పుశనగ క్వింటాల్ ధర రూ.5,850గా నిర్ణయించింది. జిల్లాలో బహిరంగ మార్కెట్‌లో ధరతో పోలిస్తే పెద్దగా తేడా లేకపోవడం గమనార్హం. తాడిపత్రి నియోజకవర్గంలో క్వింటాల్ పప్పుశనగ రూ.5,900 నుంచి రూ.6వేలలోపు ఉంది. బెలుగుప్ప మండలంలో రూ.6వేలకు దొరుకుతోంది. మిగిలిన నల్లరేగడి భూములున్న ప్రాంతాల్లోనూ ప్రభుత్వం సబ్సిడీతో పోలిస్తే పెద్దగా తేడా లేకపోవడంతో ఇదెక్కడి చోద్యం అంటూ నిట్టూరుస్తున్నారు.

పుట్టపర్తికి గ్లోబల్ గౌరవం

ప్రపంచ హృదయ దినోత్సవానికి ఆతిథ్యం

సత్యసాయి శత జయంతి వేళ గొప్ప గౌరవం

ప్రపంచ హృదయ సమాఖ్య నిర్ణయంపై సర్వత్రా హర్షం



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణారావు



వివిధ ఆకృతుల్లో సత్యసాయి విద్యార్థులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల వేళ పుట్టపర్తికి గ్లోబల్ గౌరవం దక్కింది. ప్రపంచ హృదయ సమాఖ్య (డబ్ల్యూహెచ్‌ఎఫ్) చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాదికిగాను ప్రపంచ హృదయ దినోత్సవాలను ప్రశాంతి నిలయాన్ని ఎంపిక చేసి, నిర్వహించింది. సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా డబ్ల్యూహెచ్‌ఎఫ్ అధ్యక్షుడు జగత్ నరులా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇది భారతదేశానికి లభించిన అరుదైన గౌరవం. శతాబ్దంపాటు మానవాళి హృదయాలను ప్రేమతో, సేవతో, ఆధ్యాత్మిక బోధనలతో ప్రేరేపించిన సత్యసాయిబాబాకు దక్కిన అత్యున్నత గౌరవం.

దేశానికి దక్కిన గౌరవం

ప్రపంచ హృదయ సమాఖ్య ఇప్పటి వరకు ఏ భారతీయ నగరానికి ఈ గ్లోబల్ వేడుకలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో పుట్టపర్తికి అవకాశం కల్పించడం వెనుక ఆరోగ్యశాస్త్రం, సేవాభావం, ఆధ్యాత్మికత అనే మూడు అంశాలు ఉన్నాయని డబ్ల్యూహెచ్‌ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ జగత్ నరులా పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జగత్ నురులా మాట్లాడుతూ.. సత్యసాయి బాబా సేవాస్ఫూర్తి వైద్యానికి కొత్తమార్గాలను చూపుతోందన్నారు. ప్రశాంతి నిలయంలో ఉన్న శాస్త్రం, సేవ, ఆధ్యాత్మికతల సమన్వయం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. ఇక్కడి వాతావరణం, సత్యసాయిబాబా ప్రసాదించిన సేవాభావం, ఈ వేడుకలకు ఒక ప్రత్యేక పౌర్ణమి వెలుగునిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అబ్బురపరిచేలా..

హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయి విద్యార్థుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. సత్యసాయి శత జయంతి గౌరవార్థం 100, ప్రపంచ హృదయ దినోత్సవం 25వ వార్షికోత్సవానికి గుర్తుగా 25, ప్రపంచ హృదయ సమాఖ్య లోగో, చివరిగా ఆరోగ్యంగా కొట్టుకునే హృదయం ఆకారంలో కూర్చుని, విద్యార్థులు అబ్బురపరిచారు. ప్రపంచ హృదయ దినోత్సవాలతోపాటు శ్రీసత్యసాయి గ్లోబల్ కార్డియో వాస్క్యులర్ సింపోజియం కూడా ప్రారంభమైంది. ఈ సింపోజియంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యనిపుణులు, ప్రజారోగ్య శాస్త్రవేత్తలు, ఆరోగ్య విధానకర్తలు, సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

హృదయ ఆరోగ్యంపై ఆందోళన

ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్లాదిమంది హృద్రోగాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. అధిక రక్తపోటు, అనారోగ్యకర ఆహారం, వ్యాయామంలేమి, ధూమపానం, అధిక ఒత్తిడి ఇందుకు ప్రాధాన కారణాలు అని డబ్ల్యూహెచ్‌ఎఫ్ వివరిస్తోంది. ఈ నేపథ్యంలో సమాఖ్య ఈ ఏడాదికి 'డోంట్ మిస్ ఎ బీట్.. యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్..' అనే నినాదంతో పనిచేయనుంది. సరైన ఆహారం, రోజువారీ వ్యాయామం, ధూమపానం మానుకోవడం, ఒత్తిడి తగ్గించడం తదితర సాధారణ మార్పులే ప్రాణాలను కాపాడగలవని నిపుణులు వివరించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఎఫ్ ప్రతినిధి డాక్టర్ కృష్ణారావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మిస్ బోర్జినా పెన్వాన్, పద్మభూషణ్ డాక్టర్ వీ మోహన్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ నీలందేశాయి, యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కన్నా, వివిధ దేశాలకు చెందిన ప్రముఖ హృద్రోగ నిపుణులు, సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..!

పేట్రేగిపోతున్న మాఫియా..!.. జోరుగా అక్రమ రవాణా

వరుసగా పట్టుబడుతున్నా.. తగ్గని వైనం



ధర్మవరం మార్కెట్ యార్డులో ఉంచిన పట్టుబడిన బియ్యం (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా పేట్రేగిపోతోంది. పేదలకు అందాల్సిన బియ్యం.. నిత్యం అక్రమ రవాణా చేస్తోంది. వరుసగా అధికారులకు పట్టుబడుతున్నా.. అక్రమ రవాణా మాత్రం ఆగట్లేదు. పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అడ్డదారుల్లో సరిహద్దులు దాటించి, కర్ణాటకలో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల విజిలెన్స్, పోలీసుల తనిఖీల్లో భారీగా రేషన్ బియ్యం పట్టుబడడాన్ని బట్టి జిల్లాలో అక్రమ రవాణా ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల కళ్లుగప్పి భారీ మొత్తంలో నిత్యం రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

స్టాక్ పాయింట్‌కు 100 టన్నులు

ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ధర్మవరం మార్కెట్ యార్డులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రెండునెలల వ్యవధిలో 100 టన్నుల వరకు రేషన్ బియ్యం పట్టుబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏ స్థాయిలో అక్రమంగా రవాణా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

కర్ణాటకకు తరలిస్తూ..

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మాఫియా సేకరించిన రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. బెంగళూరు, బళ్లారి, చిక్‌బళ్లాపూర్ తదితర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్కడ రీసైక్లింగ్ చేసి, సన్నబియ్యంగా మార్చి విక్రయించి, పెద్దఎత్తున అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జనం కోరుతున్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం. కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాం. బియ్యం అక్రమ రవాణా నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం.

- వైబీపీపీఏ ప్రసాద్, ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అధికారి

స్పీడు అందుకోని రైళ్లు

- అంచనాలకు దూరంగా 'మిషన్ రఫ్తార్'
- వందే భారత్ రైళ్ల వేగాలూ దయనీయమే..!
- వేగానికి తగ్గ సదుపాయాలు లేని స్థితి

గుంతకల్లు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైళ్ల వేగాలను పెంచడానికి కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ రఫ్తార్' అంచనాలను అందుకోలేకపోతోంది. ప్రయాణికుల రైళ్లు, గూడ్సు రైళ్ల సగటు వేగాన్ని 25 కి.మీ.ల మేర పెంచడానికి దాదాపు పదేళ్ల కిందట మిషన్ రఫ్తార్ పేరుతో పంచవర్ష ప్రణాళికను కేంద్రం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డీఆర్ఎంలు, సాంకేతిక సిబ్బందిని ఇటలీ, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలకు పంపి అక్కడ వేగంగా నడుస్తున్న రైళ్లు, రైల్వే వ్యవస్థపై అవగాహన కల్పించారు. భారత రైల్వేలోనూ 150 కి.మీ.ల వేగాన్ని సాధించాలన్న లక్ష్యంతో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు. ఈక్రమంలోనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, అధునాతన రైళ్లను ప్రవేశపెట్టడం, ట్రాక్ రెన్యువల్, డబ్లింగ్, ట్రిపుల్ లైన్ల నిర్మాణం, లైన్ల విద్యుద్దీకరణ, పాత తరం ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను తేవడం, డీజల్ ఇంజన్ల స్థానంలో విద్యుత్తు రైళ్లను ప్రవేశపెట్టారు. ఇన్ని మార్పులు చేసినా అనుకున్న లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోతున్నారు.

వాస్తవ పరిస్థితులివీ..

దేశంలో 1.35 లక్షల కి.మీ.ల పొడవు కలిగిన రైల్ ట్రాక్ 150 కి.మీ.లు కాదుకదా కనీసం 130 కి.మీ.ల వేగంతో నడిచే స్థాయి నాణ్యతలో లేకపోవడం ఈ వైఫల్యానికి ఓ కారణంగా చెప్పవచ్చు. గడచిన పదేళ్ల కాలంలో కొత్త లైన్ల నిర్మాణం, ట్రాక్ రెన్యువల్స్ మొత్తం ట్రాక్ నిడివితో పోలిస్తే 20 శాతానికి మించదు. దేశ జనాభాకు తగినట్లు రైళ్ల సంఖ్యను పెంచాల్సి వస్తుండటంతో రైళ్ల వేగాలను పెంచలేని పరిస్థితి కూడా నెలకొని ఉంది. కొన్ని హైస్పీడ్ రైళ్లను నడపాలంటే మరెన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ట్రాక్ సరిగా లేని కారణంగా అతి వేగంతో రైళ్లను నడిపితే ప్రమాదాలకు దారితీసే పరిస్థితులున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అధునాతనమైన లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను సమకూరుస్తున్నా, పెరంబూరులో తయారవుతున్న పాతతరం ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) కోచ్‌లను పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇంకా వినియోగిస్తున్నారు. ఈ పాతతరం కోచ్‌లు ఎక్కువ బరువుగా ఉండి, వేగంగా నడిచే సామర్థ్యం లేకపోవడం కూడా రైళ్ల వేగానికి బ్రేక్‌గా భావించాలి. విదేశాల్లో వేగంగా వెళ్లే రైళ్లకు ఆటోమేటిక్ డోర్ సిస్టం ఉంటుంది. మన దేశంలో వందేభారత్, మెట్రో, సబ్‌వే రైళ్లకు మాత్రమే అలాంటి సదుపాయం ఉంది. కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో కూడా ఆటోమేటిక్ డోర్ వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికుల భద్రత కోసం రైళ్లను వేగంగా నడపడం సాధ్యం కావడం లేదు. పైగా హైస్పీడ్ రైళ్ల నిర్వహణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది. దీంతో చార్జీలు పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది.

లక్ష్యం ఇలా..

2016-17 ఆర్థిక సంవత్సర రైల్ బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మిషన్ రఫ్తార్ పేరిట రైళ్ల వేగాలను పెంచడానికి పథకాన్ని ప్రకటించారు. అప్పట్లో ప్రయాణికులను చేరవేసే రైళ్ల సగటు వేగం గంటకు 46.3 కి.మీ.లు ఉండగా, గూడ్సు రైళ్ల సరాసరి వేగాలు 24.2 కి.మీ.లుగా ఉండేవి. ఎక్స్‌ప్రెస్ రైళ్లను సగటున గంటకు 75 కి.మీ.ల వేగాన్ని, గూడ్సు రైళ్లను సగటున 50 కి.మీ.ల వేగంతో నడపడానికి సంకల్పించారు. అప్పటినుంచి పలు రూట్లలో లైన్లను డబుల్/ట్రిపుల్ చేయడం, విద్యుద్దీకరించడం చేశారు. రైల్ ట్రాక్‌ను రీప్లేస్ చేశారు. దాదాపు 98 శాతం లెవెల్ క్రాసింగ్‌లను తొలగించారు. పలు జంక్షన్లలో బైపాస్ లైన్లను నిర్మించారు. వందే భారత్, హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లాంటి అధునాతన రైళ్లను తెచ్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో వాడి-గుంతకల్లు-తిరుపతి రూటులో రైళ్లను 130 కి.మీ.ల వేగంతో టెస్ట్ రన్ చేశారు. కొన్నాళ్లు రైళ్లను ఆ వేగంతో నడిపారు కూడా. కానీ కార్యాచరణలో పరిమితులు అర్థమై 130 కి.మీ.ల వేగం అనే మాటను పలకడం మానేశారు. అంచనాల ప్రకారం ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగాలను గంటకు 75 కి.మీ. లక్ష్యం ఉండగా ఆచరణలో మాత్రం సగటు వేగాలను 60 కి.మీ.లను దాటించలేకపోయారు. డివిజన్ మీదుగా వెళ్లే దురంత ఎక్స్‌ప్రెస్‌ల వేగాలు దయనీయంగా ఉన్నాయి. అతి వేగంగా వెళ్లే బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్ సగటు వేగం సైతం 71 కి.మీ.లుగా ఉండటాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వందే భారత్ రైలు మాత్రమే సగటున 74 కి.మీ.లో లక్ష్యానికి కాస్త దగ్గరగా నడుస్తోంది.



పరిమితులున్నా..

ఇన్ని పరిమితుల కారణంగా మిషన్ రఫ్తార్ కార్యక్రమం లక్ష్యాన్ని అందుకోలేకపోతోంది. అయితే గత కొన్నేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల 46 కి.మీ.ల సగటు వేగంతో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇప్పుడు దాదాపు 60 కి.మీ.ల సగటుతో వెళ్లగలుగుతున్నాయి. మూడు వందల కి.మీ.ల దూరం ప్రయాణించే రైళ్ల ప్రయాణ కాలం దాదాపు 2 గంటల ఆదా అవుతోంది. దీని వల్ల పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యస్థానాలను పెంచగలిగారు. ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెరిగిన కారణంగా పలు రైళ్ల ఫ్రీక్వెన్సీ కూడా పెంచారు. వారపు రైళ్లను బైవీక్లీ రైళ్లుగా మార్చడం, బై వీక్లీ రైళ్లను ట్రైవీక్లీ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేయడం, మరికొన్నింటిని డెయిలీ రైళ్లుగా మార్చారు. అంచనాల మేరకు కాకున్నా మిషన్ రఫ్తార్ వల్ల కొంతమేర ప్రయోజనం చేకూరింది.



ఈ నెల 27న అనంతలో రైలు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

▼ కొన్ని రైళ్ల వివరాలు ▼

ఎక్స్‌ప్రెస్/ సూపర్ ఫాస్ట్ రైలు	ప్రయాణ సమయం	ప్రయాణ హాల్టులు	దూరం	సగటు వేగం
1. బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691)	33-30 గంటలు	14	2,367 కి.మీ.	71 కి.మీ.
2. తిరుపతి-జమ్మూతావి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (22705)	44-50 గంటలు	12	2,985 కి.మీ.	67 కి.మీ.
3. చెన్నై-ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12164)	21-30 గంటలు	24	1,261కి.మీ.	59 కి.మీ.
4. తిరుపతి-నిజామాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793)	15-55 గంటలు	26	893 కి.మీ.	56 కి.మీ.
5. కలబురగి (గుల్బర్గ)-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (22232)	4-25 గంటలు	3	266 కి.మీ.	60 కి.మీ.
6. కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703)	8-15 గంటలు	4	612 కి.మీ.	74 కి.మీ.
7. మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (12975)	36-05 గంటలు	34	2035 కి.మీ.	56 కి.మీ.
8. మైసూరు-వారణాసి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22687)	48-55 గంటలు	32	2707 కి.మీ.	51 కి.మీ
9. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)	29-10 గంటలు	44	1,548 కి.మీ.	53 కి.మీ.
10. మైసూరు-బాగల్‌కోట్ బసవ ఎక్స్‌ప్రెస్ (17808)	21-40 గంటలు	36	1,018 కి.మీ.	47 కి.మీ.

నియోజకవర్గానికో బ్రాంచ్

డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు



సభలో మాట్లాడుతున్న నెట్టెం వెంకటేశులు, పక్కన కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికో బ్రాంచ్, గోడౌన్‌లు ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తామని డీసీఎంఎస్ (అనంతపురం ఉమ్మడి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. సోమవారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను ప్రవేశపెట్టారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం వ్యాపార ప్రగతిని ఆయన సమీక్షించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన ఎరువులు సబ్సిడీ ధరలకు అందజేస్తామని తెలిపారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని సొసైటీలను సంస్థాగతంగా బలోపేతం చేస్తామని, సొసైటీల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మునికృష్ణారెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేష్, ఉమ్మడి జిల్లాలోని సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

సొసైటీల స్థలాలను కాపాడుకోవాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (ప్యాక్స్) చైర్మన్లు సోమవారం తెలిపారు. ఈమేరకు వారు ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమార్, డీఎల్‌సీఓ వెంకటరామిరెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఏడు వికెట్లతో చెలరేగిన ధనుష్



ధనుష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు బౌలర్ ధనుష్ ఏడు వికెట్లు పడగొట్టి తన జట్టును గెలిపించాడు. హిందూపురంలో సోమవారం జరిగిన అండర్-15 జిల్లాస్థాయి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంవైసీఏ అకాడమీ జట్టును తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 120పరుగుల భారీ తేడాతో ఓడించింది. టీసీఏ బౌలర్ ధనుష్ 4ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దీంతో టీసీఏ జట్టు సెమీఫైనల్‌కు చేరింది.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ చదువుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి రెడ్డి బాలాజీ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రెన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాలకు ఈనెల 30లోగా దరఖాస్తు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఈప్రక్రియను స్థానిక సచివాలయాల్లో పరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు.

హక్కుల సాధనే ధ్యేయం

ఏపీఎన్‌జీఓ సభ్యత్వ నమోదులో ఉద్యోగ సంఘాల నేతలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఏ ప్రభుత్వానికి మనం తొత్తులు కాదు. హక్కుల సాధనే ధ్యేయంగా ముందుగా సాగాలి' అని పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో సోమవారం ఏపీఎన్‌జీఓ సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎన్జీఓ నగర అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యతగా సభ్యత్వం తీసుకోవడంతోనే ఏపీఎన్‌జీఓ విస్తరణ అవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో హక్కుల సాధన కోసం లక్ష మంది ఉద్యోగులు ఉద్యమానికి శ్రీకారం చుడితే జగన్ పోలీసులతో అణచివేశాడన్నారు. అదే చంద్రబాబు అయితే ఉద్యోగులను చర్చలకు పిలుస్తాడన్నారు. హక్కుల సాధన కోసం అక్టోబరులో నిర్వహించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.న్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏవీ సాధించాలన్న ఏపీఎన్‌జీఓ తోనే సాధ్యమన్నారు. ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘంలో మెంబర్‌షిప్ తీసుకుని సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నగరశాఖ ఆధ్వర్యంలో భారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సభ్యత్వాలను తీసుకున్నారు. సమావేశంలో ఏపీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జమీలా బేగం, కమర్షియల్ ట్యాక్స్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, అగ్రికల్చర్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఆర్టీసీ ఎంప్లాయిస్ చైర్మన్ సూరిబాబు, ఎస్టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు చిన్నారుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పని చేస్తున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. గత ఏడాది జూన్ నుంచి ఈఏడాది సెప్టెంబరు వరకు 110 కేసులు నమోదుకాగా అందులో 79 పోక్సో, మిగిలిన 31 మిస్సింగ్ కేసులుగా నమోదై తర్వాత పోక్సో కేసులుగా మారాయన్నారు. రామగిరి మండలం పోక్సో కేసుకు సంబంధించి నిందితులను జైలుకు పంపినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. పోలీసులు న్యాయం చేస్తారనే నమ్మకంతోనే బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిపారు. పోక్సో కేసుల విషయంలో అసత్యప్రచారాలు సరికాదన్నారు.

సెక్టోరల్స్ జాబితా విడుదల

అనంతపురంవిద్య, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ఏడాదికిపైగా నాన్చుతూవచ్చిన సమగ్రశిక్షలో సెక్టోరల్స్ ఎంపిక పూర్తయ్యింది. ఆమేరకు ఎంపికైన సెక్టోరల్స్ జాబితాకు కమిషనర్ విజయరామరాజు ఆమోదం వేసి పంపగా, డీఈఓ ప్రసాద్‌బాబు జాబితాను ప్రకటించి సోమవారం ఆర్డర్లు ఇచ్చారు.

ఎంపికైన వారు వీరే..

ఐఈఆర్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో పెండింగ్ పెట్టారు, ప్రస్తుతం ఐదుసెక్టోరల్స్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటించారు. అందులో ఏఎస్‌ఓగా ఎన్. నరసింహారెడ్డి(ఫిజిక్స్‌టీచర్,దేవగిరి జడ్పీహెచ్ఎస్), అసిస్టెంట్ సీఎంఓగా కె.చంద్రశేఖర్(ఎంపీపీస్కూల్, యర్రగుంట్ల, గార్లదిన్నె), ఏఎంఓగా పి.వేణుగోపాల్ (జడ్పీహెచ్ఎస్, గోనబావి), అలెస్కోగా కె.రామచంద్ర (పీఎస్‌హెచ్‌ఎం, రాయలప్పదొడ్డి), బి.నారాయణస్వామి (ఎంపీపీఎస్, కోటంక, గార్లదిన్నె) నియమితులయ్యారు.

4న కులగణనపై జిల్లాస్థాయి సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటే రాష్ట్రంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 4న జిల్లాస్థాయి సదస్సు ఏర్పాటు చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం వారు నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా 5 నుంచి 15శాతంలోపు ఉన్న అగ్రకులాలే రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయన్నారు. 50నుంచి 70 శాతం ఉన్న బీసీ కులాలు చిన్నచిన్న పదవులకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీకులాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే అక్టోబరు4న జిల్లాస్థాయి సదస్సు రాయల్ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐనాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, సంజీవప్ప, శ్రీరాములు, కేశవరెడ్డి, గోవిందు, రంగయ్య, కుళ్లాయిస్వామి, పార్వతి, ప్రసాద్ పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి పరలోకాలకు..

ఈత కోసం వెళ్లి ఇద్దరు కర్ణాటక యువకుల మృతి



బాబ్జాన్, మున్వర్‌బాషా మృతదేహాలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహానికి హాజరైన కర్ణాటకకు చెందిన ఇద్దరు యువకులు స్విమ్మింగ్‌లో మునిగి మృతి చెందిన సంఘటన సోమవారం మడకశిరలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం హాసన్‌కు చెందిన బాబ్జాన్(35) మున్వర్ బాషా(27) మడకశిరలో ఆదివారం జరిగిన తమ బంధువుల వివాహానికి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమం ముగిసిన మరుసటి రోజు సోమవారం సరదాగా సమీపంలోని అక్కంపల్లి వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ యువకులతో పాటు బంధువులు సరదాగా దాదాపు గంటసేపు ఈత కొట్టారు. బంధువుల్లో చాలా మంది స్విమ్మింగ్‌పూల్ నుంచి బయటకు వెళ్లిపోయినా బాబ్జాన్, మున్వర్‌బాషా అలాగే ఈత కొడుతూ ఉండిపోయారు. అయితే ఉన్నట్లుండి ఇద్దరూ మునిగిపోయారు. అక్కడే ఉన్న బంధువులు ఇది గమనించి, సరదాగా మునిగారేమోనని మిన్నకుండిపోయారు. ఐదారు నిమిషాలు గడిచినా బయటకు రాకపోవడంతో వారు స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగి ఇద్దరినీ బయటకు తెచ్చారు. అప్పటికే కడుపు ఉబ్బి ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని, మృతదేహాలను ఆస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేష్ బాబు తెలిపారు. కాగా బాబ్జాన్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, మున్వర్ బాషా కూలీగా పని చేసేవాడని బంధువులు తెలిపారు. బాబ్జాన్‌కు వివాహం కాగా, మున్వర్ బాషా అవివాహితుడని వెల్లడించారు.

ఆర్డీటీని ఇబ్బంది పెట్టడం సరికాదు: సీపీఐ



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న రామకృష్ణ, నాయకులు

బత్తలపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రోగులు, ప్రజలతో ఆర్డీటీ సేవలపై ఆరా తీశారు. 1969 నుంచి ఆర్డీటీ సంస్థ తన సేవలతో ఉమ్మడి జిల్లాలో ఒక మినీ ప్రభుత్వంలా పని చేసిందన్నారు. అలాంటి సంస్థకు మతాన్ని అంటగట్టి ఇబ్బంది పెట్టడం తగదన్నారు. విద్యా, వైద్యం ద్వారా ఎన్నో పేద కుటుంబాలకు ఊరట కలిగించిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌లు స్పందించి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిషాలపై ఒత్తిడి తెచ్చి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు మధు, కాటమయ్య, జింకా చలపతి, కాటమయ్య, వెంకటేసు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ హృదయరాజు



చలో విజయవాడ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హృదయరాజు, ఫ్యాప్టో నేతలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం అక్టోబరు 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ హృదయరాజు పిలుపునిచ్చారు. చలో విజయవాడ పోరుబాట సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం అనంతపురం వచ్చారు. ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా ఫ్యాప్టో(ఉపాధ్యాయసంఘాలు) నేతలతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. గత ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అనేక హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పండుగపూట కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలలో కడుపు నింపడంలేదన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పోరుబాట తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నేతలు శ్రీనివాసనాయక్, పురుషోత్తం, రమణారెడ్డి, సిరాజుద్దీన్, రాయల్‌వెంకటేష్, కులశేఖరరెడ్డి, లింగమయ్య, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, సూర్యుడు, లింగమూర్తి, వెంకటసుబ్బయ్య, రవీంద్ర, రఫీ, వెంకటరెడ్డి, రామాంజినేయులు, సరిత, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, నాగరాజు, ఖాన్, జార్జ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల సునీత వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో కలెక్టర్, ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన



పట్టణంలోని సాలేవీధిలోని పెద్దమ్మ ఆలయంలో దసర శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. స్థానిక లలితా నాట్య కళానికేతన్ గురువులు బాబూ బాలాజీ, రామలాలిత్య శిష్య బృందం భరత, కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. - ధర్మవరం

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి శైలజ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివి 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సున్న యువతి, యువకులకు స్కిల్ డెవలప్‌మెంటుపై 90రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు 7702100252 నంబరులో సంప్రదించాలని కోరారు.

మదీనా మసీదు కమిటీ చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఓ యువతికి లివర్ మార్పిడి కోసం దాదాపు రూ.20లక్షలు ఖర్చుఅవుతుందని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు చెప్పారని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మదీనా మసీదు ముతవల్లీ నాగూ ర్‌హుస్సేన్, సభ్యులు అల్తాఫ్, అయూబ్‌ఖాన్, సలీంఖాన్, స య్యద్, ఇనాయతుల్లా, షెక్షావలి ప్రస్తుతం ఇంటి వద్ద ఉన్న బాధి తురాలిని పరామర్శించారు. మసీదులో సేకరించిన వచ్చిన మొత్తం రూ.41,600 కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు.

'వడ్డెర్ల అభివృద్ధికి సహకరించండి'



ఒలిపి శ్రీనివాసులును సన్మానిస్తున్న వడ్డెర కార్పొరేషన్ చైర్మన్

కొత్తచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెర్ల అభివృద్ధికి సహకరించాలని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్‌ను ఆ కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు కోరారు. విజయ వాడలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో వడ్డెర్ల కార్పొరేషన్ డైరెక్టర్‌ల ప్రమాణస్వీకారోత్సవాన్ని సోమవారం ఆ కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమలోని వడ్డెర్ల అభివృద్ధికి కృషిచేయాలని చైర్మన్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరిక



చిలకం సమక్షంలో వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరుతున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బలిజ కల్యాణ మండపంలో సోమవారం చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి నాయకుడు జరీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వంద కుటుంబాలు జనసేనలో చేరాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఆ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు టీసీవరుణ్, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి చిలకం వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ట్రిప్పర్ బోల్తా.. ఒకరికి గాయాలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి-హిందూపురం హైవేలో ముస్లింల శ్మశానవాటిక వద్ద సోమవారం కంకర తరలిస్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ వికాస్ స్వల్పగాయాలతో బయప డ్డాడు. కంకర వేసుకుని మహమ్మదాబాద్ క్రాస్ వైపు వెళ్తున్న ట్రిప్పర్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ముదిగుబ్బ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో సోమవారం మదనపల్లి వాసికి పెనుప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. మదనపల్లికి చెందిన చీరల వ్యాపారి శివానంద వ్యాపారనిమిత్తం కారులో ధర్మవరానికి వెళ్తున్నాడు. బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ముందు టైరు పంక్చర్ కావడంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. కారులో ఉన్న శివానందకు ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

గోడ కూలి వృద్ధుడి మృతి



వెంకటరమణ (ఫైల్)

అమడగూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ. కొత్తపల్లికి చెందిన వెంకటరమణ (65) అనే వృద్ధుడు సోమవారం మృతిచెందాడు. కొత్తపల్లికి చెందిన వెంకటరమణ గ్రామంలోని తమ పాత ఇంటిని కూల్చడానికి వెళ్లాడు. ఒక్కసారి గా పాత గోడ కూలి మీద పడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా, అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో కదిరి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారై ఉన్నారు.





పుట్టపర్తి, కదిరిలో సరస్వతీదేవిగా వాసవీమాత



తాడిమర్రిలో...



మోహినీ అలంకరణలో శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి

వందే వీణా పుస్తకధారిణీ..!

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా ఏనిమిదో రోజు సోమవారం అమ్మవారిని పలుచోట్ల సరస్వతీ దేవిగా అలంకరించారు. ప్రశాంతినిలయంలోని గాయత్రీ మాత, జిల్లా కేంద్రంలోని సత్యమ్మ, వాసవీమాత, ఎనుమలపల్లి దుర్గాదేవి, కొత్తచెరువులోని నాగులకనుమ వద్దగల అలివేలమ్మ సరస్వతిదేవిగా, మామిళ్ళకుంట లలితాపరమేశ్వరి మహా చండీమాతగా దర్శనమిచ్చారు. అలాగే ధర్మవరం పట్టణంలో శ్రీనివానగర్ వెంకటేశ్వర స్వామి మోహినీ అలంకరణలో, వాసవీమాత, పుట్లమ్మ, గాయత్రీదేవి, పద్మావతి దేవి సరస్వతి దేవిగా భక్తులను అనుగ్రహించారు. కదిరి పట్టణంలో చౌడేశ్వరి, కన్యకాపరమేశ్వరి, మరకత మహాలక్ష్మి, కుమ్మరవాండ్లపల్లి మల్లాలమ్మ, బత్తలపల్లిలో అమ్మవారు సరస్వతి రూపంలో కనిపించారు. అలాగే ముదిగుబ్బ, తాడిమర్రి, తనకల్లులో వాసవీ మాత సరస్వతిగా, అమడగూరులో చౌడేశ్వరి మహాగౌరి గా భక్తులకు దర్శనమిచ్చారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

● కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మండిపాటు



కౌన్సిల్ సమాశాన్ని బహిష్కరించి, నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ధర్మవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపని సమావేశాలను నిర్వహించడం ఎందుకని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. అలాగే సోమవారం సమావేశం నిర్వహించిన తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశం ప్రారంభంలోనే కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, సాయికుమార్, పురుషోత్తంరెడ్డి, గజ్జల శివ తదితరులు మాట్లాడుతూ... సమావేశానికి మూడు రోజుల ముందే కౌన్సిల్ అజెండాను తమకు అందజేయకుండా, ప్రతి నెలా రేపు సమావేశం అనగా ముందురోజు సాయంత్రం ఇస్తే వాటిలోని అంశాలను ఎలా పరిశీలించాని ప్రశ్నించారు. సమా వేశాలు కూడా ఒక్కోనెల ఒక్కో రకంగా నిర్వహిస్తున్నారన్నారు. సాయంత్రం సమావేశాలు నిర్వహించడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. తమ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రతి సమావేశంలో కౌన్సి లర్లు చెబుతున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సంబంధిత కౌన్సిలర్లకు తెలపకుండానే వారి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను అధికారు లు వార్డుల్లో నిర్వహిస్తున్నారన్నారు. కౌన్సిల్ సమావేశం సమాచారాన్ని ముందుగా తెలపకుండా ఉన్నఫలంగా సమావేశానికి రావాలని చెప్పడం ఏమిటని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై నాలుగు నెలలుగా చెబుతున్నా అధికారుల ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. దీంతో తాము కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశం నుంచి బయటకు వెళ్లి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానం

కదిరి(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పారిశుధ్యంతో పా టు అన్ని అభివృద్ధి పనుల్లో వెనుకబడి ఉందని పలువురు కౌన్సిలర్లు పేర్కొ న్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో వందోస్థానంలో ఉండడం సిగ్గుచే టన్నారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో సో మవారం చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ... మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధి దీపాలు, మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయన్నారు. అవినీతి తారాస్థాయికి చేరిందని విమర్శించారు. కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన వ్యక్తులే అక్రమంగా డీజిల్ దోచేస్తున్నారని ఆరోపించారు. శానిటరీ సెక్రటరీ పరమేష్‌ను వెంటనే డీజిల్ విధుల నుంచి తొలగించాలన్నారు. కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం విధించాలని, టౌన్‌ప్లాన్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

● ఎమ్మెల్యే కందికుంట



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూర య్యాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం పట్టణంలో ని ఆర్అండ్‌డీ బంగ్లాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గడిచిన పదిరోజుల పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఫలితంగా కదిరిలో మైనార్టీ పాఠశాల, పాలటెక్నిక్ కళాశాలకు రూ. 7కోట్లు మంజూరయ్యాయని, రానున్న విద్యాసంవత్సరానికి ప్రారంభమవుతాయన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. హంద్రీ నీవా నీటిని అన్ని చెరువులకు అందిస్తామన్నారు. అర్హులందరికి ఇళ్ల కార్యక్రమంలో తలుపుల మండలవాసులకు ఇళ్ల వచ్చేలా కృషి చేస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో తలుపుల, కుటాగుళ్లలో ఆ పార్టీ పాలకులు కొందరు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. అలాగే అప్పటి జాబితాలో పేర్లు ఉండి, ఇళ్ల మంజూ రుకాని వారికి న్యాయం చేస్తామన్నారు. వైసీపీ నాయకుడు జగన్ అసెంబ్లీకి రాకుండా తనవారిని మండలికి పంపడంలో ఉన్న దురుద్దేశ్యం ఏమిటమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోపూరి శెట్టి చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, బీసీ నాయకులు కేటీ నాగప్ప తదితరులు పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డులను ఎమ్మెల్యే సోమవారం పట్టణంలోని మూడోవార్డులో పంపిణీ చేశారు.

దారి ఏర్పాటు

ఆంధ్రజ్యోతి స్పందన

నల్లమాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గింటివారిపల్లి కార్టర్సు దారికి మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. 'బొగ్గింటివారి పల్లికి దారి కష్టాలు' అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్పందించి ఆదేశించడంతో పులగంపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి చర్యలు చేపట్టారు. వెంటనే బురదరోడ్డుపై ట్రాక్టర్లతో మట్టిని తోలించి, చదును చేశారు. దీంతో ఆ గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అమరనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రేఖ పాల్గొన్నారు.

కులగణనను త్వరగా పూర్తి చేయాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన త్వరగా పూర్తిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... కుల గణన వీలైనంత త్వరగా రాష్ట్రంలో పూర్తిచేస్తేనే ప్రయోజనం చేకూరుతుందన్నారు. తెలంగాణాలో మాదిరి ప్రభుత్వం జనగణనకు సంబంధించి నిర్ణయం త్వరగా తీసుకోవాలని కోరారు. అంతేకాక స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. తమ హక్కులను సాధించుకునేందుకు బీసీలు ఐక్యంగా పోరాడిల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి సీపీఐ జిలా కార్యవర్గసభ్యుడు జగదీస్, వైసీపీ నాయకులు కేటీ శ్రీధర్, బీసీ సంఘాల నాయకులు సామకోటి ఆదినారాయణ, రమేష్‌గౌడ్, అంపావతిని గోవిందు, ఏఐటీయూసీ నాయకులు అంజనేయులు, చేతివృత్తి సంఘం నాయకులు జింకాచలపతి, రైతుసంఘం నాయకులు కాటమయ్య, నాయకులు జయచంద్రమోహన్, వినోద్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ సర్వీసు టీచర్లను మినహాయించాలి'

కొత్తచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి ఇన్ సర్వీసు టీచర్లను మినహాయించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణను ఉపాధ్యాయులు కోరారు. వారు సోమవారం రామకృష్ణను జిల్లా కేంద్రంలోని సాయి ఆరామంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలని కోరుతానని తెలిపారు. ఎస్టీయూ నాయకులు మల్లు రఘునాథరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టండి

● అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

ధర్మవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రూరల్ వాటర్ సప్లై, శానిటేషన్, జల్‌జీవన్‌మిషన్, విద్యుత్, మైనింగ్, ఇరిగేషన్, హౌసింగ్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన పథకాలను వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల కారణంగా ధర్మవరం ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణాలలో ప్రజల కలలను జగన్ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ: నియోజకవర్గ వ్యాప్తంగా 102 మంది లబ్ధిదారులకు రూ.67లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చె క్కులను మంత్రి సోమవారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో పంపిణీచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను గుర్తుచేశారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

● బత్తలపల్లి : మండలకేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు కోటి సూర్యప్రకాష్‌బాబు రెండు నెలల క్రితం కిందపడి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ సోమవారం ఆయన ఇంటికి పరామర్శించారు. బీజేపీ నాయకులు సందిరెడ్డి శ్రీనివా సులు, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరుబాట: ఫ్యాప్టో

కొత్తచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 7వ తేదీన విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు సోమవారం పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ పోరుబాటను చేపట్టినట్లు తెలిపారు.

హామీలు అమలుచేయాలి : న్యాయవాదులు

ధర్మవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత న్యాయవా దుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్, బార్ అసోసియేషన్ కోశాధికారి అబ్దుల్ సాబ్ కోరారు. వారు సోమవారం స్థానిక కోర్టు ఆవరణంలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ... రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి అందరు కృషిచేయాలన్నారు. న్యాయస్థానాల్లో మౌలిక వసతులు, హెల్త్ కార్డులు తదితర సమస్యలు పరష్కరించాలని డిమాండ్ చేశారు. వాటి పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. న్యాయవాదులు వీరమాసప్ప, సతీశ్, నరసింహమూర్తి, పెద్దన్న, బిల్లే రవి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ, తహసీల్దార్, చైర్మన్

లేపాక్షి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలానక్షత్రం సందర్భంగా దుర్గాదేవి అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం దుర్గాదేవి సరస్వతిదేవి అలంకరణలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హిందూపురం డీఎస్పీ మహేష్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, రూరల్ సీఐ జనార్దన్, ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

లేపాక్షిలో భక్తులకు అన్నదానం


ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీపీ

లేపాక్షి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. లేపాక్షి మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీటూరిజం డైరెక్టర్ జయప్ప, హిందూపురం టీడీపీ నాయకులు మంగేష్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సేవలు అందించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తరహళ్లి నరసింహస్వామి,జిల్లేడగుండ ఆంజనేయస్వామి ఆలయాల నూతన ధర్మకర్తల మండల కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆలయ కమిటీకి సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సేగౌడ్‌తో పాటు 11 మంది సభ్యులచేత దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రెండు దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి,ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు, రామాంజనేయులు, కరియన్న పాల్గొన్నారు.

ప్రశాంతమైన జీవనం సాగించండి : సీఐ


గుర్రపుకొండ గ్రామంలో మాట్లాడుతున్న సీఐ నాగేష్‌బాబు

మడకశిర రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు ప్రశాంతమై జీవనం అలవర్చుకోవాలని సీఐ నాగేష్‌బాబు తెలిపారు. సోమవారం గుర్రపుకొండ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అక్రమ మద్యం, మట్కా, గంజాయి, జూదం వంటి అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గుడిబండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ శ్వేత, మునిరత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం బాలేపల్లిలో పౌష్టిక వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగనవాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్లు పంపిణీ

పావగడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ కింద పనిచేసే అర్హులైన లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్మిక శాఖ అధికారి హరీష్‌కుమార్ మాట్లాడుతూ.. తాపీమేస్త్రీలు, కమ్మరి, ఇతర కులవృత్తులవారికి తమ శాఖ నుంచి ప్రతి సౌకర్యాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమాజసేవకుడు నాని, పీఎల్‌టీ బ్యాంక్ అధ్యక్షుడు శేషగిరి, మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు గీతహనుమంతరాయప్ప పాల్గొన్నారు. కార్మిక కిట్లు కేవలం ఎమ్మెల్యే సూచించిన వారికే అందించారని కార్మిక నాయకులు అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించలేదని, వారి పిల్లల విద్య ఎదుగుదలకు కూడా కార్మికశాఖ ఏమాత్రం సహకరించడం లేదని మండిపడ్డారు.


కార్మికులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు


హిందూపురంలో యల్లమ్మ దేవికి సరస్వతీదేవిగా అలంకారం


సరస్వతీదేవిగా గాయత్రీదేవి


విద్యాగోపాలన్ అలంకారంలో పేట వెంకటరమణస్వామి


పెనుకొండలో సరస్వతీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

చదువులతల్లిగా దర్శనం


గోరంట్లలో కన్యకాపరమేశ్వరికి సరస్వతీదేవి అలంకరణ

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆలయాల్లో అమ్మవార్లు చదువులతల్లి సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. హిందూపురం పట్టణంలోని పేట వెంకటరమణస్వామి వీణదారుడైన విద్యాగోపాలన్ అలంకరణలో దర్శనమిచ్చారు. ఎల్లమ్మదేవి, గాయత్రిదేవి ఆలయాల్లో సరస్వతిదేవిగా కనువిందు చేశారు. వాసవీమాత, బోయకొండ గంగమ్మ, కొల్హాపురి మహాలక్ష్మీ, రాజరాజేశ్వరి, అష్టలక్ష్మీ, చౌడేశ్వరిమాత ఆలయాల్లో చదువులతల్లిగా దర్శనమిచ్చారు. పెనుకొండలో పంచాంగం సుబ్రహ్మణ్యశాస్త్రి, శేషప్పస్వామి గృహాల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతిదేవిగా అలంకరించారు. మడకశిర కన్యాకాపరమేశ్వరి, వడిసలమ్మ ఆలయాల్లో సరస్వతీ దేవిగా అలంకరించారు. గోరంట్ల, పరిగి, సోమందేపల్లిలో సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు.


పెనుకొండలో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు





మడకశిరలో సరస్వతీదేవి అలంకరణలో వాసవీమాత, వడిసలమ్మ.. పరిగిలో సప్తమాతృక దేవి, సోమందేపల్లిలో చౌడేశ్వరిదేవికి సరస్వతీదేవి అలంకరణ

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి

● వైసీపీ నేతలు గాలికూతలు మానుకోండి
● బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

పరిగి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని ఊటకూరు గ్రామంలో సోమవారం నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల వ్యాప్తంగా రూ.5కోట్లతో 56 సీసీ రోడ్ల పనులు పూర్తిచేశామని తెలిపారు. త్వరలోనే మండల వ్యాప్తంగా శిక్షణ పొందిన 300 మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిగి నుంచి శ్రీరంగరాజులపల్లి వరకు రూ.3.50 కోట్లతో రోడ్డు నిర్మాణానికి త్వరలో భూమిపూజ చేస్తామని అన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరగలేదంటూ గాలికూతలు కూస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారు గ్రామాల్లోకి వెళ్లి అభివృద్ధి పనులను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ రెడ్డప్ప, వైద్యులు స్వరూపరెడ్డి, రూబి, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, బాలాజీ, ప్రవీణ్ రెడ్డి, కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు పరిగి వేణుగోపాల్ రావు, వెంకటేష్, సంజీవరాయప్ప, హనుమయ్య పాల్గొన్నారు.


ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

శ్మశానవాటికకు స్థలం కేటాయింపు

● పెనుకొండ టౌన్: మండలంలోని వెంకరెడ్డిపల్లి పొలంలో శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించారు. దీంతో మంత్రి సవితకు కౌన్సిలర్ గిరి, దత్తారెడ్డి, పలువురు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎకరం భూమికి సంబంధించిన పట్టా అందించారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయించండి

సోమందేపల్లి మండలంలో కల్యాణ మండపానికి స్థలం కేటాయించాలని బోయ, వాల్మీకి కులస్థుల మంత్రి సవితకు విన్నవించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు.

కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వండి

● సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ
● అభివృద్ధిని ఓర్వలేకనే అక్కసు : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి

హిందూపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచిన ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వాలని వైసీపీకి చెందిన కౌన్సిలర్లు అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. త్వరలోనే రూ.92 కోట్లతో అభివృద్ధి పనులు శ్రీకారం చుడతామని తెలిపారు. గుడ్డం కోనేరును సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని రూ.18.30 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. కౌన్సిలర్ రోషన్ మాట్లాడుతూ.. అజెండాను ప్రారంభిస్తారా లేదా అని ప్రశ్నించారు. దీంతో అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, కౌన్సిలర్ జబీవుల్లా, రోషన్ మాట్లాడుతూ.. సచివాలయాల్లో పనులు జరగలేదని, టీడీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు చెప్పిందే చేస్తామంటున్నారని అన్నారు. తాము కౌన్సిలర్లుగా ప్రజలకు ఏమని సమాధానం ఇవ్వాలని ప్రశ్నించారు. కమిషనర్ వీటిపై స్పందించలేదన్నారు. ఈ సందర్భంలో టీడీపీ కౌన్సిలర్ రాఘవేంద్ర మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో టీడీపీ కౌన్సిలర్లను సచివాలయాల్లోకి కూడా వెళ్లనీయకుండా అడ్డుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అజెండాలోని 14వ అంశంపై వివాదం చోటుచేకుంది. వైసీపీ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. చైర్మన్, టీడీపీ సభ్యులు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో పట్టణంలో పట్టుమని రూ.10లక్షల పని కూడా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో వారు జీర్ణించుకోలేక సభ నుంచి వెళ్లిపోయారన్నారు. డీసెంట్ నోటీసును కలెక్టర్‌కు పంపుతామని చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, కాలనీ వాసులు

గోరంట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటైన సీపీఎం కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ కమలాబాయికి సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు నీటి సరఫరా, విద్యుత్, కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటలక్ష్మమ్మ, స్వర్ణలత, పెద్దన్న, అంజలి, ఆంజనేయులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం పైపులైన్ల ఏర్పాటు


పైపులైన్ ఏర్పాటు కోసం గుంతలు తవ్వుతున్న కార్మికులు

అగళి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరిగేపల్లి ఎస్సీ కాలనీలో గత రెండు వారాలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో ఆ గ్రామ టీడీపీ సర్పంచ్ లక్ష్మమ్మ లింగరాజు పైపులైన్ ఏర్పాటుచేసి ఆ కాలనీకి తాగునీటి సమస్య పరిష్కరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో వీధిలైట్లు, మురుగు కాలువలు, శుభ్రం చేయించారు.

కంకర పరిచి వదిలేశారు..!

● తప్పుకున్న కాంట్రాక్టర్
● ప్రయాణికులకు తిప్పలు

అమరాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అమరాపురం నుంచి విరపసముద్రం వరకు కంకర తేలి రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సుమారు ఏడు కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో రూ.24 కోట్లు మంజూరయ్యాయి. బీటీ రోడ్డు ఉన్న రోడ్డును పెకలించి చదును చేసి కంకర పరిచి వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధి కమీషన్ డిమాండ్ చేయడంతో మొదటిసారి ఎంతో కొంత సొమ్ము ఇచ్చి కంకర పరిచారు. 2022లో విస్తారంగా వర్షాలు కురవడంతో రోడ్డు ధ్వంసమయింది. వర్షాలకు కంకర కొట్టుకుపోవడంతో కాంట్రాక్టరు మరోసారి కంకర వేయించి దానిపై మట్టి తోలించాడు. అప్పటి ప్రజాప్రతినిధి మరోసారి కమీషన్‌కు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ ఇచ్చుకోలేక రోడ్డును అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోయాడు. చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డును పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

కబ్జాలకు పాల్పడితే చర్యలు

● మన్రో తోపును పరిశీలించిన డీఎల్‌పీఓ
● కబ్జాదారులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



మన్రో తోపు స్థలాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి

చిలమత్తూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పచ్చదనానికి మారుపేరుగా నిలిచిన కోడూరు మన్రో తోపులో కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'మన్నించు మన్రో' అనే కథనానికి ఆయన స్పందించారు. ఆయన కోడూరు తోపు వద్దకు వచ్చి పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌తో కలిసి కబ్జాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటికే కొందరు ఇష్టానుసారంగా పంచాయతీ ఆధీనంలో ఉన్న మన్రో తోపు భూమిలో చదును చేసి కబ్జాలకు పాల్పడిన విషయాన్ని గుర్తించారు. గతంలో కొందరు ఇదే మన్రో తోపులో శాశ్వత భవనాలు నిర్మించుకున్నారని, ఇప్పుడు అదే రీతిలో మరోసారి మన్రో తోపులో కబ్జాలకు యత్నిస్తున్నారని అన్నారు. మన్రో తోపులో ఇష్టానుసారంగా స్థలాలను ఆక్రమించుకొని కబ్జాలకు పాల్పడుతున్న పలువురిపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు చేయరాదని హెచ్చరించినా పట్టించుకోకుండా కొందరు స్థలాలను చదునుచేసే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఐ మునీర్ అహమ్మద్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ స్పందిస్తూ.. మన్రో తోపులో కబ్జాలకు పాల్పడిన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆటోకింద పడి కూలీ మృతి


నందిని మృతదేహం

రొద్దం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండంలోని పెద్దకోడిపల్లికి చెందిన నందిని(32)అనే మహిళా కూలీ ఆటో కిందపడి మృతి చెందింది. పెద్దకోడిపల్లికి చెందిన నందిని తాడంగిపల్లిలో పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఆటో కిందపడి మృత్యువాత పడింది. తాడంగిపల్లి నుంచి స్వగ్రామానికి ఆటోలో డ్రైవర్ పక్కన సీటులో కూర్చుని ఉండగా సుబ్బరాయప్పకొట్టాల వద్ద జారి కిందపడగా ఆటో వెనుక చక్రం ఎక్కింది. వెంటనే అందులో ఉన్న మహిళా కూలీలు, డ్రైవర్ రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బంధువులు ఆసుపత్రికి చేరుకుని రోధించిన తీరు కలిచివేసింది. ఎస్ఐ నరేంద్ర కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


మృతి చెందిన మంజునాథ్

హిందూపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూపురం-గోరంట్ల ప్రధాన రహదారిలోని చెర్లోపల్లి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. అప్‌గ్రేడ్ ఏఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి మండలం మరువకుంటపల్లికి చెందిన రామాంజినప్ప కుమారుడు మంజునాథ్(23) అనే యువకుడు సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. చెర్లోపల్లికి చెందిన మేస్త్రి నరసింహమూర్తి వద్ద పనులు చేసేవాడు. ఆదివారం సాయంత్రం స్వగ్రామం నుంచి డబ్బులు ఇప్పించుకునేందుకు వస్తూ చెర్లోపల్లి సమీపంలో మలుపువద్ద ద్విచక్రవాహనం వేగంగా వచ్చి అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. చేతికందిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీదేవి ప్రమాణ స్వీకారం


బాధ్యతలు తీసుకుంటున్న శ్రీదేవి

చిలమత్తూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొడికొండ చెక్‌పోస్టుకు చెందిన టీడీపీ నాయకురాలు శ్రీదేవి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆశీస్సులతో తనకు ఈ పదవి వచ్చిందని, ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ వడ్డెర కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్‌డే


వరల్డ్ హార్ట్‌డే నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది

పావగడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ హృదయ దినోత్సవాన్ని సోమవారం పావగడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పాలన అధికారి డాక్టర్ గణేష్ బాబు మాట్లాడుతూ.. గుండె సంబంధిత వ్యాధులతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, దానిని అధిగమించాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని, తగిన వ్యాయామం శరీరానికి ఎంతో అవసరమని తెలిపారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండి గుండెను పదిలంగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సీడీ డాక్టర్ షరీంబాను, డాక్టర్ చంద్రకళ, ఏఎన్‌ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : చైర్మన్

మడకశిర టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు తెలిపారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వివరించారు. ప్రధాన రహదారుల్లోని డివైడర్లలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరచామని అన్నారు. పాత కూరగాయల మార్కెట్‌లో చెత్తను తొలగించి వ్యాపారులకు, పట్టణ వాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి రూ.5.5కోట్ల నిధులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్, వైస్ చైర్మన్‌లు ప్రభావతి, వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నరసింహరాజు